క్లుప్తంగా

సింహాచలం రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్


మాక్ డ్రిల్‌లో భాగంగా ప్రయాణికుల బ్యాగులు చెక్ చేస్తున్న పోలీసులు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌లో జీఆర్‌పీ, రైల్వే, గోపాలపట్నం పోలీసులతో పాటు పలు విభాగాల పోలీసులు సంయుక్తంగా మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఎస్పీ రఘువీర్ ఆదేశాల మేరకు రైల్వే స్టేషన్‌లో మాక్ డ్రిల్ చేపట్టారు. రైల్వే స్టేషన్‌లో అసాంఘిక శక్తులు ప్రవేశిస్తే ఏవిధంగా చర్యలు తీసుకోవాలన్న అంశంపై పలు కృత్యాలు చేశారు. అనుమానిత ప్రయాణికుల బ్యాగులు చెక్ చేశారు. బ్యాగుల్లో పేలుడు పదార్థాలు, మారణాయుధాల రవాణాను ఏవిధంగా అడ్డుకోవాలో ప్రాక్టీస్ చేశారు. కార్యక్రమంలో సీఐ మహేష్, ఎస్‌ఐ బీపీ రావు, గోపాలపట్నం స్టేషన్ ఎస్‌ఐ అప్పలనాయుడు, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కురిసింది వాన


పారిశ్రామిక ప్రాంతం రోడ్లపై చేరిన వర్షపునీరు

మల్కాపురం: వర్షాకాలంలో ఎండ తీవ్రత అధికంగా ఉంది. ఆది,సోమ,మంగళవారాలతో పాటు బుధవారం ఉదయం వరకు ఎండ తీవ్రత కనిపించింది. తొమ్మిది గంటలకు ఒక్కసారిగా వాతావరణంలో మార్పు వచ్చింది. దట్టమైన మేఘాలు అలుముకుని భారీ వర్షం కురిసింది.ఉదయం 10.10 గంటల వరకు కురిసిన వర్షానికి పారిశ్రామిక ప్రాంతంలో రోడ్లు జలమయమయ్యాయి.హమ్మయ్యా అని సేదతీరిన పారిశ్రామిక వాసులకు అంతలోనే మరలా ఎండ విజృంభించడంతో ఇదేమి వాతావరణం దేవుడా అని విసుగుకున్నారు.

తల్లి చెంతకు కుమారుడు


గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లో తల్లీకొడుకుతో సీఐ నరసింహారావు

గోపాలపట్నం: గోపాలపట్నం లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌కు చెందిన బోడ స్వప్నను ఆమె ఎనిమిదేళ్ల కుమారుడిని గోపాలపట్నం పోలీసులు కలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో నివాసముంటున్న బోడ స్వప్నకు సురేష్ అనే వ్యక్తితో 2010లో వివాహమైంది. అయితే గొడవల కారణంగా 2016లో విడిపోయి వేరుగా ఉంటున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 9న ఆమె కుమారుడు శ్యామ్‌ను తన భర్త సురేష్ తీసుకు వెళ్లారని గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ ఈదుల నరసింహారావు ఆదేశాలతో పోలీసులు స్వప్నతో కలిసి ఖమ్మం వెళ్లారు. అక్కడి పోలీసుల సహకారంతో ఆమె కొడుకు శ్యామ్‌ను తీసుకు వచ్చి అప్పగించారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్త రోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ప్రతిక్షణం .. ప్రజాక్షేత్రంలో ..


చిన్న బుచ్చిరాజుపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్, బెహరా భాస్కరరావు


మద్రిపాలెంలోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఆనంద్‌కుమార్. చిత్రంలో ఎస్‌ఏ రెహమాన్ తదితరులు

- గడప గడపకు మన ప్రభుత్వం 100 రోజుల వేడుక
- పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసిన ఆనంద్ కుమార్

గోపాలపట్నం : ప్రతి క్షణం ప్రజా క్షేత్రంలో ఉన్నది వైఎస్సార్‌సీపీ నాయకులే అని పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో జీవీఎంసీ 91వ వార్డు చిన్న బుచ్చిరాజుపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమయ్యారు. స్థానికంగా ఉన్న సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ఎన్నో మంచి పథకాలు అందిస్తూ ఇంకా ప్రజల సమస్యలు ఏమున్నాయో తెలుసుకోవడానికి ముఖ్యమంత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మీ వద్దకు పంపారని ప్రజలకు తెలిపారు. ప్రజల క్షేమం కోసం పరితపించే ముఖ్యమంత్రికి మద్దతుగా అంతా నిలవాలని కోరారు. పశ్చిమ నియోజకవర్గంలో గెలిచిన టీడీపీ ఎమ్మెల్యే కరోనా కష్టకాలంలో కూడా కనిపించకుండా పోయారని, ప్రజలకు అందుబాటులో లేని నాయకుడయ్యాడని విమర్శించారు. అలాంటి నాయకున్ని మళ్లీ ఎందుకు గెలిపించుకోవాలంటూ ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం కోసం పని చేసిన నాయకత్వాన్ని మాత్రమే గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించుకుందామన్నారు. ఈ సందర్భంగా 400 కుటుంబాలను ఆయన కలిశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ, చుక్క పైడి రాజురెడ్డి, దేరెడ్ల సత్యనారాయణ, దొడ్డి రామచంద్రరావు, వూటపల్లి గోవిందు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పండగ..

మద్రిపాలెం వుడా లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించి 100 రోజులు అయిన సందర్భంగా వేడుక నిర్వహించారు. నియోజకవర్గ నాయకులు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షుల సమక్షంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన పశ్చిమ నియోజకవర్గం పరిశీలకుడు ఎస్‌ఏ రెహమాన్ మాట్లాడుతూ సేవా దృక్పథంతో పని చేసే నాయకుడు మన నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా రావడం అదృష్టమని అన్నారు. ప్రజల సమస్యల కోసం పరితపించే నాయకుడని కొనియాడారు. సమస్య ఉందని చెబితే చాలని వెంటనే స్పందించి ప్రభుత్వం ద్వారా గాని, సొంత నిధులు వెచ్చించి గాని ఆ సమస్యను పరిష్కరిస్తారని అన్నారు. రీజనల్ ఐ ఆసుపత్రిలో రూఫ్ సమస్య ఉందంటే వెంటనే స్పందించి పనులు చేపట్టారని తెలిపారు. ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించామని తెలిపారు. స్వచ్ఛందంగా నిరుపేదలకు పింఛన్లు ఇస్తున్నామన్నారు. నియోజకవర్గంలో 14 వార్డుల్లో 40 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామన్నారు. సచివాలయం పరిధిలో ఉన్న సమస్యలను రూ. 20 లక్షల నిధులతో పరిష్కరించామని తెలిపారు. నియోజకవర్గం పరిధిలో రూ. 3.20 నిధులతో సుమారు 50 పనులు చేపట్టామని తెలిపారు. ఆడారి ట్రస్ట్ ద్వారా 48 మందికి రూ. 6 లక్షలు వెచ్చించి నెలవారి పెన్షన్ రూపంలో అందించామని పేర్కొన్నారు. అనంతరం వార్డు నాయకులతో కలిసి గడప గడపకు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి భద్రీనాథ్, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, వార్డు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి


కార్యక్రమంలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

మల్కాపురం : మహిళల తమ జీవితాలపై అధికారాన్ని, నియంత్రణను కలిగి ఉండాలని జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ఆడిటోరియం వద్ద మహిళా సాధికారతపై ప్రత్యేక తరగతులు బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యావంతులు కావాలన్నారు. ఉపాధి రంగాల్లో వారికి తగిన రిజర్వేషను అముల చేయాలన్నారు. మహిళా నాయకత్వ శిక్షణ శిబిరాలను విరివిరిగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు కలిసి మహిళా చైతన్యంపై ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కళాశాల ప్రతినిధి జానీస్, అధ్యాపకులు ఎ.ఆదిలక్ష్మి, ఇ.అంజలీదేవి, జయశ్రీ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు నాగిరెడ్డి, ఆడారి పరామర్శ


పిలక దేవేశ్వరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, బద్రీనాథ్ తదితరులు


బంగారమ్మకుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తదితరులు

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంత సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు పిలక రామ్మోహన్‌రెడ్డి (రాము) భార్య పిలక దేవి ఈశ్వరి ఇటీవల అరుణాచలం వద్ద మృతి చెందిన సంగతి తెలిసిందే. మల్కాపురం, రెడ్డివీధి వద్ద మృతురాలి ఇంటి వద్ద బుధవారం సంతాప కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొని మృతురాలికి నివాళులర్పించి, ఆమె భర్త, 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలక రామును ఓదార్చారు. ధైర్యంగా ఉండాలన్నారు. ఈ సంతాప కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బద్రీనాథ్, పలు వార్డుల కార్పొరేటర్లు బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, పీవీ సురేష్, కొణతాల సుధ, పుర్రె పూర్ణశ్రీ సురేష్‌యాదవ్, నాయకులు ధనలత, పూండి మల్లేశ్వరరావు, మూగి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే 60వ వార్డు పవన్‌పుత్ర కాలనీ ప్రాంతానికి చెందిన చెల్లిబోయిన బంగారమ్మ ఇటీవల మృతి చెందటంతో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక పార్టీ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ మళ్ల ధనలత తదితరులు మృతురాలి భర్త చెల్లిబోయిన ముత్యాల్యు, కుమారుడు చెల్లిబోయిన శేషు రామకృష్ణ, చెల్లిబోయిన రాజు, వెంకటలక్ష్మి, భవానీలను పరామర్శించి ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా నిలుస్తుందని వారికి భరోసా కల్పించారు.

ముంచెత్తిన వరదనీరు

- పాక్షిక కాల్వ ఏర్పాటు చేసిన జీవీఎంసీ అధికారులు


కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు


పాక్షికంగా కాలువ తవ్విస్తున్న అధికారులు

గోపాలపట్నం: కొత్తపాలెం నుంచి నవర వెళ్లే రహదారిలో నిలిచిన వర్షపు నీరు తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. చిన్న వర్షానికే రహదారి జలమయం కావడంతో స్థానికులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. దీంతో జోన్–8 జీవీఎంసీ అధికారులు పాక్షిక చర్యలు చేపట్టారు. వర్షపు నీరు తొలగించేందుకు పాక్షిక కాల్వ ఏర్పాటు చేస్తుండడంతో కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. దిగువన ఉన్న తమ ఫ్లాట్లపైకి నీరు వస్తోందని వాపోయారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ జయరామ్ మాట్లాడుతూ సమగ్ర సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో స్థానికులు ఆందోళన విరమించారు.

‘ఈ-చలానా రద్దు చేయాలి’


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న మోటారు యూనియన్ నాయకులు

సీతమ్మధార : మ్యాక్సి క్యాబ్‌కు పెంచిన రోడ్డు ట్యాక్స్, గ్రీన్‌ట్యాక్స్, ఈ చలానా రద్దు చేయాలని కోరుతూ టాటా మ్యాజిక్ డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ రవాణా రంగం వలన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ. మూడు లక్షల కోట్ల ఆదాయం వస్తుందన్నారు. తాము కట్టిన పన్నుల్లో కనీసం ఐదు శాతం ఖర్చు పెడితే డ్రైవర్లందరికీ పీఎఫ్, ఈఎస్‌ఐతో కూడిన వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయవచ్చన్నారు.

గంగవరం పోర్టు కార్మికులకు అండగా నిలుస్తాం

మల్కాపురం: గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని సీఐటీయూ మల్కాపురం జోన్ నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి అన్నారు. గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు వద్ద బుధవారం నిరసన చేపట్టారు.సీఐటీయూ నాయకుడు పెంటారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో లక్ష్మణమూర్తి మాట్లాడుతూ పోర్టు యాజమాన్యం మొండి వైఖరి వల్ల పని చేస్తున్న కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం


నూతన సభ్యులచే ప్రమాణం చేయిస్తున విశ్వేశ్వరవర్మ తదితరులు

డాబాగార్డెన్స్ : రోటరీ క్లబ్ విశాఖ పోర్టు సిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం బుధవారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. 2023–24 ఏడాదికి క్లబ్ అధ్యక్షుడిగా ఆర్. రామకృష్ణారావు, కార్యదర్శిగా ఎన్ఎస్ఎన్ రాజు, కోశాధికారిగా కేవీ రమణ ప్రమాణ స్వీకారం చేశారు. వీరిచే అసిస్టెంట్ గవర్నర్ డి. విశ్వేశ్వరవర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా రోటరీ గవర్నర్ ఆర్‌వీ సుబ్బారావు సభ్యులనుద్దేశించి మాట్లాడారు. రోటరీ విశాఖ పోర్టు సిటీ సేవా సంస్థ అభివృద్ధికి సభ్యులంతా కృషి చేయాలన్నారు. చక్కని సేవా కార్యక్రమాలు నిర్వహించి సంస్థని ప్రగతిపథంలో నడిపించాలని కోరారు. గత కమిటీ సభ్యులు నిర్వహించిన సేవా కార్యక్రమాలను ఆయన ప్రశంసించారు. పూర్వ గవర్నర్ డి. విశ్వనాథ్ నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. రోటరీ విశాఖ పోర్టు సిటీ పూర్వాధ్యక్షుడు యూఎస్ శర్మ, పూర్వ కార్యదర్శి సుధీర్ చౌదరీ, పూర్వ కోశాధికారి కళాదర్రాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ప్రమాణ స్వీకారంలో భాగంగా పర్యావరణహితాన్ని కోరుతూ సభ్యులు మొక్కలు నాటి రక్తదానం చేశారు.

ఘనంగా మానవ హక్కుల కౌన్సిల్ వార్షికోత్సవం

డాబాగార్డెన్స్ : మానవ హక్కులను పరిరక్షించడమే ప్రథమ కర్తవ్యమని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ 24వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దామోదర సంజీవయ్య లా కాలేజీ మాజీ ఉపకులపతి ఆచార్య వై. సత్యనారాయణ పాల్గొని జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికీ ప్రజల్లో తమకు గల హక్కులపై సరైన అవగాహన లేకపోవడంతోనే అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆచార్య వై. సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికీ మహిళలు, చిన్నారులపై లైంగిక వేధింపులు, దాడులు జరగడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ఏయూ డాక్టర్ అంబేడ్కర్ లా కాలేజీ ఆచార్య విజయలక్ష్మి మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి పౌరుడు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా ఆచార్య వై. సత్యనారాయణను కౌన్సిల్ సత్కరించింది. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పి. జగన్మోహనరావు, రిటైర్డ్ పోలీస్ అధికారి ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సేవామూర్తులు.. వలంటీర్లు

- పవన్ వ్యాఖ్యలను ఖండిస్తున్న ప్రజలు


యారాడ బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లు(ఫైల్)


కరోనా సమయంలో బాధితురాలికి బియ్యం అందిస్తున్న వలంటీర్(ఫైల్)

సింధియా: వలంటీర్ వ్యవస్థ సేవకు మారుపేరుగా నిలిచింది. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు నియమించిన వలంటీర్లు నిజాయితీగా సేవలందించి ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. కరోనా విపత్తు వేళ వారు అందించిన సేవలకు ఎన్నో ప్రశంసలు దక్కాయి. రోగులకు మందులు, పౌష్టికాహారం అందించి ఎంతో మంది ప్రాణాలు నిలిపారు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. లబ్ధిదారుల ఇంటికే వెళ్లి ఠంచన్‌గా పింఛన్ అందించడంతో పాటు ప్రతీ కుటుంబానికి ఏయే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయో తెలియజేస్తూ వారితో దరఖాస్తు చేయించి, నేరుగా పథకాల లబ్ధిని అందేలా సహకరిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు వారి సేవలను కొనియాడుతున్నారు.జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నారు. గట్టి బుద్ధి చెప్తారన్నారు.

కుటుంబ సభ్యుడిలా..



మా వీధిలో ఉంటూ కుటుంబ సభ్యుడిలా అన్ని విషయాల్లో అండగా నిలబడుతున్నారు మా వలంటీర్. ప్రభుత్వ పథకాల గురించి ఎప్పటికపుడు మాకు చెబుతూ మా అర్హతను బట్టి ఆ పథకాలు అందే విధంగా చేస్తున్నారు. గతంలో ఈ సేవలన్నీ డబ్బులిస్తే గాని లభించేవి కావు. ఇపుడు వలంటీర్లపై ఆరోపణలు చాలా దారుణం.

–కొత్తపల్లి సంతోషి, 89వ వార్డు, కొత్తపాలెం.

వలంటీర్ల సేవలు అమోఘం



ప్రభుత్వ పథకాలు అందించడంలో వలంటీర్లు బాగా పని చేస్తున్నారు. ఇంటికి వచ్చి అర్హతను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారు. వలంటీర్ల ద్వారా అమ్మ ఒడి, వాహనమిత్ర పథకాలకు ఎంపికయ్యాము. కరోనా సమయంలో సైతం వలంటీర్లు ధైర్యం చెప్పి అండగా ఉండేవారు. సొంత మనుషులుగా అనిపించే వలంటీర్లను అవమానించడం సరికాదు. పవన్ కల్యాణ్ వారిని కించపరిచేలా మాట్లాడడం తగదు.

–కొయిలాడ ఆదిలక్ష్మి, దుర్గానగర్, 62వ వార్డు)

మాపై ప్రజలకు విశ్వాసం ఉంది..



ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానంగా పని చేస్తున్నాం. మాపై ప్రజలకు విశ్వాసం ఉంది. పిచ్చి వాగుళ్లను మేం పట్టించుకోం. మా వెనుక ప్రజలు, వారి నమ్మకం ఉంది.

–సంతోష్‌కుమార్, వలంటీర్, కొత్తపాలెం

కరోనా కష్టకాలంలో మమ్మల్ని ఆదుకున్నారు..

కరోనా కష్టకాలంలో మేము ఇంట్లోనే ఉండిపోయాం. మమ్మల్ని మా వలంటీర్ ఎంతగానో ఆదుకుంది. బియ్యం, మందులు, నిత్యావసరాలు అందించారు. ఆ సమయంలో వారు ప్రాణాలకు తెగించి మాకు సేవలందించారు. వారి సేవలను మర్చిపోలేం.

– రత్నం, కరాసా, 52వ వార్డు.

ఆడారి ఔదార్యం

- ఓ కుటుంబానికి సొంత నిధులు రూ.2.లక్షల అందజేత


రూ.2 లక్షల చెక్కు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ మానవత్వం చాటుకున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. కష్టాల్లో ఉన్న ఓ కుటుంబానికి భరోసా ఇచ్చారు.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు పవన్‌పుత్రకాలనీ ప్రాంతానికి చెందిన పల్లా శ్రీధర్‌యాదవ్ గ్యాస్ కంపెనీలో పని చేసే వాడు. విధుల్లోలో ఉండగా ఇటీవల ఆయనకు గుండెపోటు వచ్చి మృతి చెందాడు. దీనిపై గ్యాస్ కంపెనీ వద్ద లోడింగ్ అన్ లోడింగ్ కార్మికులు, మృతుడి బంధువులు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఆడారి ఆనంద్‌కుమార్ అక్కడకు వెళ్లి మృతుడి బంధువులకు అండగా నిలిచి యాజమాన్యంతో మాట్లాడి ఆ కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకున్నారు. అంతే కాదు ఆరోజు మృతుడి ఇద్దరి పిల్లలకు తన వంతు సాయంగా రూ.2 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు బుధవారం పవన్‌పుత్రకాలనీలో ఉంటున్న మృతుడి భార్యకు రూ.2 లక్షల చెక్కు అందించి మానవత్వం చాటుకున్నారు. పిల్లలను బాగా చదివించాలని, ఏ కష్టమొచ్చినా అండగా నిలుస్తామని ఆమెకు భరోసా ఇచ్చారు. ఆనంద్‌కుమార్ చేసిన సాయానికి ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,62వ వార్డు కార్పొరేటర్ బల్లా లక్ష్మణరావు, నాయకులు మళ్ల ధనలత,అంగ రామ్ ప్రసాద్,నరేష్,నమ్మి శ్రీను,భీశెట్టి గణేష్,ఆడారి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అండర్ పాత్‌వేలో రాకపోకలకు ఇక్కట్లు


వర్షపు నీటితో నిండిపోయిన అండర్ పాత్‌వే

- వర్షం నీరు నిలిచిపోయి అవస్థలు పడుతున్న ప్రజలు

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం పరిధి పైడిమాంబకాలనీ సమీపంలో గల రైల్వే అండర్ పాత్‌వే మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నీట మునిగింది. ఈ రహదారి రైల్వే వాషింగ్ లైన్, డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ లోకోషెడ్లకు వెళ్లే ఉద్యోగులతో పాటు దయానందనగర్, చాకలిగెడ్డ, రాజీవ్‌కాలనీ, ముత్యమాంబ కాలనీ, అటు జ్ఞానాపురం రైల్వేస్టేషన్, భారత ఆహార గిడ్డంగి సంస్థ, కంచరపాలెం నేతాజీ వంతెనకు వెళ్లే ప్రధాన మార్గం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేల సంఖ్యలో ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు ప్రయాణం చేస్తుంటారు. చిన్నపాటి వర్షానికే ఇలా ఉంటే భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు ఆడుగుల నీరు వంతెన మార్గంలో నిలిచిపోవడంతో ఆయా కాలనీల ప్రజలు మర్రిపాలెం వరకు వెళ్లి కంచరపాలెం ప్రధాన రహదారికి రాకపోకలు సాగించారు. ఈ ప్రాంతం పోర్టు ఆధీనంలో ఉండడంతో రైల్వే, జీవీఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేకపోతున్నారని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పర్యవేక్షించి వంతెన దిగువ మార్గంలో శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఉద్యోగులు, ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం నిర్వహించారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అలాగే స్వామికి సహస్రనామార్చన పూజ ఘనంగా నిర్వహించారు.